క్లుప్తంగా

బీఎల్ఓలకు శిక్షణ



శిక్షణలో అధికారులు, బీఎల్ఓలు

మొగుళ్లపల్లి: మండలంలోని బూత్ లెవల్ అధికారులకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తహసీల్దార్ సునీత మాట్లాడు తూ.. కొత్త ఓటరు నమోదు, తొలగింపులు, చే ర్పులు, మార్పులకు సబంధిచిన విషయాల్లో తీసుకోవాలిస్న జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు తిరుపతి, శ్రీ నివాస్, నరేష్, ఆర్ఐ శివరామకృష్ణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కాళేశ్వరం: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాళేశ్వరం ఎస్సై తమాషారెడ్డి అన్నారు. మంగళవారం ప్రతి గ్రామంలోని గోడలకు మత్తు పానియాల గురించి వాల్ కొటేషన్‌లను రాయించారు. ప్రతి గ్రామంలో 'మన ఊరు-మన పోలీస్' అనే విధంగా ఒక పోలీస్, గ్రామ పోలీస్ అధికారిని నియమిస్తు వారి ఫోన్‌నంబర్లు రాయించారు. గ్రామ పోలీస్ అధికారి గ్రామంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకొని వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



మొక్క నాటుతున్న రాజ్‌మహ్మద్

చిట్యాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ ఎండీ.రాజ్‌మహ్మద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్ ఆవరణంలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎండీ.హఫీస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సన్మానం



రఫీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎండీ.రఫీ సోమవారం వరంగల్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులుగా మీదుగా పీహెచ్‌డీ పట్టా పొందారు. దీంతో మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గిరగాని కృష్ణ, ఉపాధ్యాయులు రవీందర్, యోగానంద చారి, మమత, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు బన్సోడ రామారావు ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మీర్జా ముబీన్ అహ్మద్‌బేగ్, ఉపాధ్యక్షులుగా జాగిరి అశోక్, వీరగంటి రాజు, ప్రధాన కార్యదర్శిగా అడప రమేష్, కార్యదర్శిగా సుభాష్ చంద్రబోస్, కోశాధికారిగా మజీద్, కార్యవర్గ సభ్యులు చిటికేసి శ్రీనివాస్, దేవేందర్, సాకేత్, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన మీర్జా ముబిన్ అహ్మద్‌ను పాత్రికేయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు శశాంక్, కేదారి ప్రవీణ్ కుమార్, పరమ రాజ్యుల శివకుమార్, రాజబాబు, సంతోష్, రాజు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

మల్హర్: బైక్ అదుపు తప్పి ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోత్ మోతిలాల్ అనే యువకుడు వ్యక్తిగత పనుల మీద నాచారం గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో అన్సాన్‌పల్లి, సంద్రువాయి మార్గమధ్యలోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో మోతిలాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం అతడిని భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి

- ఒక్కసారి నాటితే 30 ఏళ్లు ఆదాయం
- ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు



ఆయిల్ పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు (ఫైల్)

రేగొండ: ఆయిల్‌పామ్ సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించి వారిని సాగు చేసేందుకు సన్నద్ధం చేశాయి. జిల్లా వ్యాప్తంగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ఇప్పటికే చాలా మంది ముందుకువచ్చారు. సాగుకు అనువైన పరిస్థితులు ఉండడంతో అధికారులు కూడా రైతులకు పూర్తిగా అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 3,900 ఎకరాల్లో ఆయిల్‌పామ్ చేస్తున్నారు. ఈ సంవత్సరం మరో 2,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను పెంచేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. మూడు సంవత్సరాలు మొక్కలను జాగ్రత్తగా పెంచితే.. ముప్పై ఏళ్లు ఏటా ఎకరానికి రూ.2 లక్షల ఆదాయం పొందవచ్చని అధికారులు తెలుపుతున్నారు. దీంతో ఉద్యాన పంటలను సాగు చేసేందుకు అన్నదాతలు ముందుకు వస్తున్నారు.

రాయితీపై మొక్కలు, బిందు సేద్యం పరికరాలు

అయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. అయిల్‌పామ్ మొక్క ఖరీదు రూ.200 కాగా, రైతులకు 90 శాతం రాయితీతో రూ.20లకే అందజేస్తోంది. అయిల్‌పామ్ రైతులకు డ్రిప్ పరిమితీ 12.5 ఎకరాలకు పరిమితం చేసింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీని అందిస్తుంది. యూనిట్ ధరపై 12 శాతం జీఎస్టీని రైతులు చెల్లించాలి. బీసీలకు 90 శాతం సబ్సిడీ, ఓసీలకు 80 శాతం రాయితీ ఉంటుంది. అయిల్‌పామ్ మొక్కలు నాటుకున్న రైతులకు ఎకరానికి రూ.4200 చొప్పున 4 సంవత్సరాల పాటు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. నాలుగో ఏటా నుంచి దిగుబడి మొదలవుతుంది.

అంతర పంటలతో మేలు

అయిల్‌పామ్ సాగు చేసే వారు అదనపు ఆదాయాన్ని పొందేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అంతర పంటగా కూరగాయాలు, మక్కలు, పల్లి, పత్తి, బొప్పాయి, సోయాబీన్, కొత్తిమీర, మెంతికూర వంటివి వేసుకుని అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని సూచిస్తున్నారు. అయిల్‌పామ్ మొక్కలు నాటిన నాలుగేళ్ల తర్వాత దిగుబడి వస్తుందని, అప్పటి వరకు అంతర పంటలతో ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు



రైతులు సంప్రదాయ పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి. ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహకాలను అందజేస్తుంది. ఎక్కువ సంవత్సరాలు ఆదాయం పొందేందుకు ఆయిల్‌పామ్ సాగు రెతులకు బాగా ఉపయోగపడుతుంది. పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కంపెనీలు నేరుగా రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తాయి.

– సునీల్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

విద్యార్థుల నమోదు పెరగడం అభినందనీయం

- జిల్లా విద్యాధికారి రాజేందర్



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాజేందర్

కాళేశ్వరం: బెగుళూర్ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.రాజేందర్ అన్నారు. మంగళవారం ఆయన మహదేవపూర్ మండలంలోని బెగుళూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామ్మూర్తి అధ్యక్షతన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలలో 33మంది విద్యార్థులకు గాను 110మంది వరకు విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. అత్యధికంగా అడ్మిషన్లు నమోదయ్యాయన్నారు. అడ్మిషన్‌లు పెరగడానికి సహకరిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలను, తల్లిదండ్రులను అభినందించారు. ఉపాధ్యాయులు ఆదర్శమైన బోధన చేస్తూ భావితరాలకు ఉపయోగపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, సీఎంఓ సామల రమేష్, డీసీబీ సహాయ కార్యదర్శి చల్ల కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన దేవస్థానం అధికారులు



దేవస్థానం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఈఓ, తదితరులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం అనుబంధదేవాలయం శ్రీఆదిముక్తీశ్వర స్వామి ఆలయ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో మామిడి, మారేడు మొక్కలను ఈఓ మహేశ్ ఆధ్వర్యంలో నాటారు. ఆయన వెంట సూపరింటెంటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

ఉచిత ప్రసాదం పంపిణీ..

కాళేశ్వరాలయంలో ప్రతీ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత ప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు ఈఓ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రేపు శాకంబరీమాతగా అమ్మవారు..

కాళేశ్వరాలయం అనుబందేవాలయమైన శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో ఆషాఢమాసం పురస్కరించుకొని గురువారం గురుపౌర్ణమి సందర్భంగా అమ్మవారు శాకంబరీగా భక్తులకు దర్శనమివనున్నారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. కాగా, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు ఇబ్బంది కలగొద్దు

- ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా

కాటారం: ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా సూచించారు. కాటారం మండలం మేడిపల్లి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను మంగళవారం పీఓ తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, పారిశుద్ధ్య నిర్వహణ, తరగతి గదులు, వంట గది, విద్యాబోధన, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, ఇతరత్రా సౌకర్యాలు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదనపు గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. వంట గది, తరగతి గదులు, డార్మెటరీ శుభ్రంగా ఉంచేలా నిత్యం క్లీనింగ్ చర్యలు చేపట్టాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. పీఓ వెంట డీడీ పోశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేటి సమ్మెకు సంఘీభావ ర్యాలీ



ర్యాలీలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

భూపాలపల్లి అర్బన్: నేడు(బుధవారం) నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల పోరాట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సేవానాయక్, అశోక్, కుమారస్వామి, తిరుపతి, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు గట్టయ్య, శంకర్, కిర ణ్, వీరన్న పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

కాటారం: కార్మిక వర్గాల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ నేడు(బుధవారం) నిర్వహించనున్న ఒక రోజు సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ కోరారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పా టు చేసిన విలేకర్ల సమావేశంలో కిరణ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి కార్మికుల హక్కులకు తూట్లు పొడిచిందన్నారు. దీనికి నిరసనగా కార్మిక లోకం ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

జనహృదయ నేత వైఎస్సార్



టేకుమట్ల: వైఎస్సార్ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

జిల్లా వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జనహృదయ నేత వైఎస్సార్ అన్నారు. పేదల కోసం ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గుర్తుచేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రేగొండ: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాళేశ్వరంలో..

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న చౌహాన్

మొగుళ్లపల్లి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చౌహాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కొలిపాక రమాదేవి అధ్యక్షతన మహిళా శక్తి సంబురాల్లో భాగంగా నిర్వహించిన సమావేశానికి చాహ్వన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మహిళకు అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన మహిళలందరికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.సంధ్య ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎమ్ అంబాల రవివర్మ, మండల సమాఖ్య కోశాధికారి బత్తిని శిరీష, కార్యదర్శి సునీత, సీసీలు శ్రీనివాస్, ప్రవీణ్, మండల సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మహిళలు స్వశక్తితో ఎదిగి, ఆర్థిక సుస్థిరతను సాధించాలని డీపీఎం ఐబీ గోవింద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ధనలక్ష్మీ మండల సమాఖ్య అధ్యక్షురాలు గువ్వాడి రజిత అధ్యక్షతన ఇందిరా మహిళా శక్తి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోవింద్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థిక స్వావలంభన కోసం స్వయం సహాయక సంఘాలకు స్వయం సమృద్ధితో స్కూల్ యూనిఫాం, టైలరింగ్ ద్వారా ఉపాధి కల్పించారని అన్నారు. ఏపీఎం శ్రీనివాస్, సీసీ రాజేందర్, మంజుల, సీవో స్వాతి, ఎంఎస్ కార్యదర్శి బోయిని శ్రీజ, కోశాధికారి అబ్బెంగుల రాణి పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార సాధన జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ కోఆర్డినేటర్ కొత్తూరు రవీందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చాలామంది పేద విద్యార్థులు పాఠశాలలు దూరమై విద్యకు దూరమవుతున్నారని. వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు.


ప్రథమ చికిత్స కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న డాక్టర్ శ్రీదేవి

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రాలను (ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్) మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రం అని బోర్డు పెట్టాలని, రోగ నిర్ధారణ చేసి మందులు, ఇంజక్షన్లు వేయడం, ప్రిస్క్రిప్షన్ వాడకూడదన్నారు. సెలైన్ బాటిల్స్ ఎక్కించడం, రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేయరాదన్నారు. అధిక మోతాదు మందులు వాడడం, అబార్షన్లు చేయడం, కాన్పులు చేయడం చట్ట విరుద్ధమని చెప్పారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించి అర్హతగల ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి చికిత్స చేసిన వారిపై ప్రభుత్వ ఆదేశానుసారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెడికల్ షాపులను సందర్శించి ఆర్ఎంపీల ప్రిస్క్రిప్షన్‌లపై మందులు అమ్మరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి రోహిణి, డెమో శ్రీదేవి పాల్గొన్నారు.

చెరువులో జారి పడి వ్యక్తి మృతి



స్వామి (ఫైల్)

మల్హర్: చెరువులో జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొయ్యూరులో చేసుకుంది. కాటారం సీఐ నాగార్జునరావు, బాధిత కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. మండలంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన కోలకాని స్వామి (38) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. సోమవారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లాడు. చీకటి పడిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వేతికిన జాడ కనిపించలేదు. కొయ్యూరు శివారులోని చెరువులో రాత్రి శవమై తేలాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మంగళవారం మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న మమత

టేకుమట్ల: మహిళలు మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ మమత అన్నారు. మంగళవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన బేటీ పడావో–బేటీ బచావో ఆడ పిల్లలకు వరం అని అన్నారు. ఆడ పిల్లల చదువు, సంరక్షణ కోసం ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకం అని అన్నారు. స్త్రీలు, బాలికలు పని చేసే చోట, చదువుకునే చోట ఎలాంటి ఆపద చోటు చేసుకున్నా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181, వృద్ధుల హెల్ప్‌లైన్ నంబర్ 14567, సైబర్ క్రైం 1930 టోల్ ఫ్రీ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన, అంగన్‌వాడీ టీచర్లు పోషిని లావణ్య, విజయమ్మ, స్వరూప, అనూష, ఆశావర్కర్లు స్వప్న, రమా, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో బడి మానేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కొడెపాక రఘుపతి, డీపీఎం గోవింద్ చౌహాన్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఓపెన్ స్కూల్ సంపూటికను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో చదువు మధ్యలో మానేసిన వారిని గుర్తించి ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్ తీసుకునే విధంగా పోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఉర్మిళదేవి, ఝాన్సీరాణి, ఏపీఎం మంజుల, మండల సమాఖ్య ప్రతినిధులు ఉమ, స్వప్న, నిర్మల, సీసీలు, వికెఏలు, ఉపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, బుర్ర సదయ్య, రాజమౌళి, సీఆర్పీలు రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ నమోదు



రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈఓ పుష్పలత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కాళేశ్వరం ఏఈఓ పుష్పలత ఆధ్వర్యంలో రైతు రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాళేశ్వరం క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని రైతు రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతో అనుసంధానించిన రైతురిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆన్లైన్‌లో నమోదు చేసినట్లు వివరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్: ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ కోసం ఈనెల 14న తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ.. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ టీవీఏసీ జేఏసీ నాయకులు మంగళవారం జిల్లా సర్కిల్ కార్యాలయం ఆవరణలో సమ్మెకు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ చేయాలని కోరారు. నాయకులు ఈశ్వరరావు, వజీర్, కోటి, భాస్కర్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

కాటారం: వర్షాకాలం సీజన్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ముందస్తు చర్యలు, నీటి సరఫరా పైప్‌లైన్‌ల, గేట్‌వాల్వ్ లీకేజీల మరమ్మతు, వాటర్ ట్యాంక్‌లను శుభ్రపర్చుట తదితర అంశాలపై ఎంపీఓ వీరస్వామి సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రాజశేఖర్, వైద్యాధికారిని మౌనిక, పలు శాఖల ఏఈలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.10.45 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న భక్తులు

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీలను లెక్కించగా రూ.10.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ మహేష్ మంగళవారం తెలిపారు. నోట్లు రూ.9,57,940, నాణెములు రూ.88,023 లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, ఆలయ చైర్మన్ భిక్షపతి, ధర్మకర్తలు శ్రీధర్, ఆకుల రమేష్, ఓంకార్, బండి మల్లయ్య, కోలేపాక సాంబయ్య, ఇల్లి కళావతిరవి, వేణు, సుదర్శన్, జోగేందర్, ఐలయ్య, సంపత్‌రావు, ఓదెలు, ఆలయ సిబ్బంది రవిందర్, శ్రావణ్, సుధాకర్, జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల రాజు, కొత్తపల్లిగోరి భజన బృందాలు పాల్గొన్నారు.